

## సమతా ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాగపూర్ డివిజన్‌లో ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, నిజాముద్దీన్ మధ్య రాకపోకలు సాగించే సమతా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తాత్కాలికంగా రద్దుచేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ-నిజాముద్దీన్ మధ్య నడిచే సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈనెల 30, మే 1, 3, 4, 6 తేదీల్లో రద్దు చేశామన్నారు. తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ (12808) మే 2, 3, 5, 6, 8 తేదీల్లో రద్దుచేశామని, ప్రయాణికులు గమనించాలన్నారు.

# పోలీసులున్నారు జాగ్రత్త!

- నగరంలో విస్తృతంగా సోదాలు
- జాతీయ రహదారి పొడవునా ఎక్కడికక్కడ తనిఖీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

**నగరంలో నేరాలను అరికట్టాల్సిన పోలీసు యంత్రాం గం జరిమానా వసూలు చేసే చట్టాలను అమలుచేయడంలో బిజీగా మారింది. ఇప్పటికే ద్విచక్ర వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధరించినా సిగ్నళ్ల వద్ద పంచాయితీ పెడుతున్నారు. పాత చలానాలున్నాయా? అని పరిశీలించి చెల్లించేవరకు వదిలి పెట్టడం లేదు. తాజాగా బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్ కాలిస్తే (ధూమపానం) రూ.200 వరకు జరిమానా వేసే చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసే చర్యలు చేపట్టడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.**

ఎప్పటి నుంచో అమల్లో ఉన్న ఈ చట్టంపై నగర పోలీసులు ఇప్పటి వరకు పెద్దగా దృష్టి పెట్టలేదు. ఇటీవల దీనిపై కూడా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఐదు రోజుల క్రితం మధురవాడ వైపు వెళుతున్న లారీ సిబ్బంది జూ పార్క్ వద్ద రాత్రి 11 గంటలు దాటిన తరువాత వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, కిందికి దిగి సిగరెట్ కాల్చుకుంటున్నారు. అటు వైపు వెళ్తున్న పోలీసులు ఆగి వారిని ప్రశ్నించి, ఆరు బయట సిగరెట్ కాలుస్తున్నందున జరిమానా కట్టాలని రూ.200 చొప్పున చలానా వసూలు చేశారు. ఎవరూ లేని ప్రదేశంలో అర్ధరాత్రి సిగరెట్ కాల్చడం నేరమా? అని వారు ప్రశ్నిస్తే...బయట ఎక్కడ కాల్చినా తప్పే అని సమాధానమిచ్చారు.

**పాన్ షాపుల వద్ద ...**

నగరంలో ప్రతి పాన్‌షాపులో సిగరెట్లు అమ్ముతున్నారు. ధూమపాన ప్రియులు ఇంటికి వెళ్లి కాలిస్తే భార్యాబిడ్డలు గమనిస్తారని, సిగరెట్ కొన్న దగ్గరే నాలుగు దమ్ములు లాగేసి, పారేసి పోతుంటారు. ఇలాంటి వారి కోసం పాన్‌షాపు నిర్వాహకులు లైటర్లు తాడు కట్టి మరీ ఏర్పాటు చేస్తున్నారు. అలాంటి ఏర్పాట్లు ఉన్నప్పుడు బహిరంగంగా కాకుండా ఇంకెక్కడ కాలుస్తారనేది ప్రశ్న. పోలీసులు వీటిపై కూడా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



జూ పార్క్ సమీపాన అర్ధరాత్రి కేసు నమోదు చేస్తున్న పోలీసు (ఫైల్)

**పెదవాల్తేరు పండగలో డ్రంకన్ డ్రైవ్ కేసులు**

నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసేందుకు వీలుగా మద్యం దుకాణాల పక్కన మాటువేసి కేసులు పెట్టడం రివాజు. ప్రస్తుతం పండగల సీజన్. అన్ని ప్రాంతాల్లో అమ్మవారి జాతరలు జరుగుతున్నాయి. వీటిని పోలీసులు కేసుల కోసం ఉపయోగించుకుంటున్నారు. తాజాగా మంగళవారం పెదవాల్తేరు పోలమాంబ జాతర జరిగింది. ఆ ప్రాంతంలోని అన్ని జంక్షన్లలో పోలీసులు రాత్రి కాపు కాచి, వాహనాలను ఆపి డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. బ్రీథింగ్ ఎనలైజర్ పరీక్షలు చేసి కేసులు పెట్టారు. భార్యాపిల్లలతో స్కూటీలపై వెళుతున్న వారిని కూడా ఆపి పరీక్షలు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. పండగ పూట ఈ కేసుల గొడవ ఏమిటని వాపోతున్నారు. ఏదేమైనా రోడ్డు పైకి వస్తే పోలీసు జరిమానాల బారిన పడకుండా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని నగరవాసులు వాపోతున్నారు.

# పకడ్బందీగా చందనోత్సవం

## గత తప్పిదాలు పునరావృతం కాకూడదు

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేయాలి: హోం మంత్రి అనిత
- దైవభక్తి ఉన్న అధికారులనే ఉత్సవానికి నియమించాలి: ఎమ్మెల్యే వెలగపూడి
- నకిలీ టికెట్లు లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే పల్లా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి.

- సామాన్య భక్తులకు సమస్యల్లేకుండా చూడాలి: ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు
- క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్‌తో టికెట్లు, పాస్‌ల జారీ: కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఉదయం 5 గంటలలోగా వీఐపీలకు అంతరాలయ దర్శనం
- సింహాచలంలో అప్పన్న చందనోత్సవంపై సమీక్షా సమావేశం


చందనోత్సవ ఏర్పాట్లను మంత్రికి వివరిస్తున్న కమిషనర్

వేపగుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సామాన్య భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సింహాచలం గోశాల సమీప శ్రీనివాసనగర్‌లోని దేవస్థానం నూతన కల్యాణ మండపంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఉన్నత సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలు, తప్పిదాలపై కూలంకుషంగా అన్ని విభాగాల అధికారులతో చర్చించి, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ వీవీఐపీ, ప్రొటోకాల్ టికెట్ల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించేందుకు రూ.1,500 టిక్కెట్లును కేవలం 2,500 మత్రమే ముద్రించామన్నారు. వాటిలో క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. దర్శనం కోసం వేచి ఉండే భక్తుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే చికిత్స అందించేందుకు వీలుగా అంబులెన్స్‌లు వారి వద్దకు చేరేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండమార్గంలో వాహనాలు ఆగిపోతే వాటిని వెంటనే తరలించేందుకు క్రేన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ఆశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే జనరేటర్‌తో విద్యుత్ సరఫరా చేసేలా ఆదేశాలు జారీచేశామన్నారు. కొండపైకి భక్తులను తరలించేందుకు వీలుగా పూర్తి ఫిట్‌నెస్ ఉన్న బస్సులను మాత్రమే వినియోగించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ కొండపైకి ఎక్కువ వాహనాలను అనుమతించకూడదని, జ్యుడీషియరీ, రెవెన్యూ, దేవస్థానం విభాగాల నుంచి ఒక్కో ఉద్యోగిని ప్రవేశమార్గంలో ఉంచితే వారు వీఐపీలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. వీఐపీతో పాటు వచ్చే కుటుంబసభ్యుల్లో ఆరుగురిని మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ క్యూలైన్ మధ్యహోల్డింగ్ బ్లాక్ ఏరియా ఏర్పాటుచేసి, రద్దీకి అనుగుణంగా భక్తులను నిలిపి ఉంచి, రద్దీ తగ్గిన తరువాత క్యూలైన్‌లో కలిపేందుకు రోప్ పార్టీల సాయంతో విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని, దానిని ఇక్కడా అమలు చేయాలన్నారు. తెల్లవారుజాము ఆలయ అనువంశిక ధర్మకర్త ... మిగతా 6వ పేజీలో

# కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

## పూర్ణామార్కెట్ గెజిట్‌లోని సరిహద్దు దాటి దందా

- స్టాండింగ్ కమిటీ ఆమోదం లేకుండానే ఆశీలు వసూలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీవీఎంసీ యంత్రాంగం
- జోన్-4 అధికారులకు వ్యాపారుల ఫిర్యాదు
- అయినా నేటికీ చర్యలు శూన్యం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

**పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టరు ఇషారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్టాండింగ్ కమిటీ అనుమతి లేకుండానే ఆశీలు వసూలు చేయడంతో పాటు వేలం సమయంలో జీవీఎంసీ గెజిట్‌లో పేర్కొన్న హద్దులు దాటి ఉన్న దుకాణాల నుంచి కూడా ఆశీలు వసూలు చేస్తున్నారు. దీనికి అడ్డుకట్టవేయాల్సిన జోన్-4 అధికారులు కనీసం పట్టనట్టు వ్యవహరించడం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడంతో కాంట్రాక్టరు నిలువుదోపిడీ చేస్తున్నారని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.**

జీవీఎంసీ జోన్-4 పరిధిలోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ (పూర్ణామార్కెట్) అత్యంత ముఖ్యమైనది. మార్కెట్ లోపల సుమారు 640 దుకాణాలున్నాయి. అవికాకుండా మార్కెట్ ప్రహరీని అనుకుని పండ్లు, పూల దుకాణాలు వంద వరకు ఉంటాయి. వీటితోపాటు మార్కెట్‌లోని దుకాణాలకు సరకులు తీసుకొచ్చి, తీసుకెళ్లే వాహనాల నుంచి ఆశీలు వసూలుచేయడం, పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు జీవీఎంసీ ఏటా వేలం నిర్వహిస్తుంది. దీనికి ప్రకటన జారీచేసినపుడే ఆశీలు వసూలు చేసుకోవాల్సిన ప్రాంతం సరిహద్దులు, ఆశీలు రేటుతో కూడిన గెజిట్‌ను విడుదల చేసింది.



ఆశీలు వసూలు చేసిన రశీదు (ఫైల్)

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలుకు రెండు నెలల కిందట జోన్-4 అధికారులు వేలం నిర్వహించారు. కూటమికి చెందిన చోటానేత అత్యధిక ధరకు వేలం పాడుకున్నారు. ఈ ఫైల్‌ను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత అంతా సక్రమంగానే జరిగిందని కమిటీ భావిస్తే ఆశీలు వసూలు బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. అయితే వేలం నిర్వహణ జరిగిన తర్వాత స్టాండింగ్ కమిటీ సమావేశం జరగకపోవడంతో ఫైల్ పెండింగ్‌లో ఉండిపోయింది. దీంతో ఈనెల ఒకటి నుంచి పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలు బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి అవకాశం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించేవరకు జోన్-4 రెవెన్యూ విభాగం స్వయంగా ఆశీలు వసూలుచేయాలి. కానీ కాంట్రాక్టరు ... మిగతా 6వ పేజీలో


పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

# జడ్పీ పనులకు మోకాలడ్డు

## అధికారులపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు ఒత్తిడి తెస్తున్నారు

- జడ్పీ సమావేశంలో సభ్యుల ధ్వజం
- పోడియంను చుట్టుముట్టి నిరసన
- ప్రమాద మృతులకు ఒకే తరహా ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఎమ్మెల్యే బండారు ప్రతిపాదనకు సమావేశం ఆమోదం
- జలజీవన్ మిషన్ పనులపై గోప్యత ఎందుకు?
- జడ్పీ సమావేశంలో సమస్యలు లేవనెత్తిన సభ్యులు


జడ్పీ నిధుల వినియోగంపై పోడియం వద్ద నిరసన తెలియజేస్తున్న సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న పనులకు ఎలమంచిలి నియోజకవర్గంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేయనివ్వకుండా ఎమ్మెల్యే విజయకుమార్, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై చర్చ జరిగినప్పుడు పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, ఎలమంచిలి నియోజకవర్గంలో జడ్పీ నిధు లతో పనులు జరగడంలేదని సహచర సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని దీనిపై చైర్‌పర్సన్, అనకాపల్లి కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎలమంచిలితోపాటు ఇతర మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్ పోడియంను చుట్టుముట్టి నిరసనకు దిగారు. దీంతో చైర్‌పర్సన్ స్పందిస్తూ 'ఎలమంచిలి'లో నిధుల వ్యయంపై గతంలో ఒకసారి సభ్యులు ప్రస్తావించారని గుర్తుచేశారు. అప్పట్లో అధికారులకు ఆదేశాలు ఇచ్చినా.. ఇంత వరకు సమస్య పరిష్కారంకాలేదన్నారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ పనులు జరిగేలా ఆదేశాలిస్తానని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

సమావేశం ప్రారంభంకాగానే కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. అన్ని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దారు, ఎస్ఐ, ఎంపీడీవోల నేతృత్వంలోని కమిటీ ప్రతి నెలా తనిఖీచేస్తే భవిష్యత్తులో ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. బాణసంచా ప్రమాదంతోపాటు ఫార్మా, ఇతర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు చెల్లించే పరిహారంలో వ్యత్యాసం ఉంటోందని, బాధిత కుటుంబాలు ధర్నాలు చేయాల్సి వస్తోందన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు ఒకే విధమైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం ఒక విధానం రూపొందించాలని కోరుతూ జడ్పీ తీర్మానం చేయాలని ... మిగతా 6వ పేజీలో

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

## రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, భవిష్యతులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అధికారులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేపై గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించామని, అందిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలలో వచ్చిన వినతులు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే దరఖాస్తులలో అధికంగా ఆర్‌వోఆర్, రీసర్వే, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, 22-ఎ నుంచి తొలగింపులు, ఇళ్ల స్థలాల మంజూరు వంటి అంశాలు ఉంటున్నాయన్నారు. ఆయా దరఖాస్తులు సత్వరం పరిష్కరిస్తున్నామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ వివరించారు. విశాఖలో చాలా వరకు ఇళ్లు 22-ఎలో ఉన్నాయని వినతులు వస్తున్నాయని పేర్కొంటూ వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాధుర్, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని

# కన్నతండ్రే కాలయముడై!

## నాలుగేళ్ల కుమార్తెపై అత్యాచారం

- తగరపువలసలో దారుణం
- నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు



భీమునిపట్నం/రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):

**కన్న తండ్రే కాలయముడయ్యాడు. అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటన తగరపువలసలో జరిగింది. సీఐ తిరుమలరావు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం...**

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన ఓ వ్యక్తికి భార్య, ఐదేళ్ల కుమార్తె, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. వీరంతా వన్‌టౌన్‌లోని జాలారిపేటలో నివాసం ఉంటున్నారు. సుమారు రెండేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య జాలారిపేటలోనే ఉన్న పుట్టింట్లో పిల్లలతో ఉండగా, పక్క ఇంట్లోనే ఆ వ్యక్తి వేరేగా నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరగడంతో భర్త పిల్లలను తీసుకుని వెళ్లిపోయాడు. మద్యం మత్తులో తిప్పలవలస తీసుకు వెళ్లిపోతున్నాడని భావించి బాలిక తల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను వివరించింది. అక్కడి సిబ్బంది ఇలాంటి విషయాలను పట్టించుకోమని చెప్పడంతో వెనుదిరిగినట్టు ప్రచారం జరుగుతోంది. పిల్లలను తీసుకువెళ్లిన వ్యక్తి ... మిగతా 6వ పేజీలో

## ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య



కొమ్మాది, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహంలో ఉండేందుకు ఇష్టం లేక విద్యార్థి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా గరివిడి మండల కేంద్రంలోని బద్రి ప్రసాద్ కాలనీకి చెందిన తీడ అచ్చుతరావు కుమారుడు కార్తికేయ (15) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. జేఈఈ పరీక్షల నిమిత్తం తల్లిదండ్రులు అతన్ని ఈనెల 13న మారిక వలసలోని ఒక కార్పొరేట్ కళాశాలలో చేర్చారు. అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. జాయిన్ చేసినప్పుడే తనకు వసతి గృహంలో ఉండడం ఇష్టం లేదని, డే స్కాలర్‌గా జాయిన్ అవుతానని తల్లిదండ్రులకు చెప్పాడు. కానీ వారు అందుకు అంగీకరించలేదు. ఇంటర్ మొదటి ఏడాది వసతి గృహంలో ఉండి చదువుకుంటే, ద్వితీయ సంవత్సరం నుంచి డే స్కాలర్‌గా చేరుస్తామని చెప్పి, కుమారుడ్ని ఒప్పించాడు. మంగళవారం ఉదయం కూడా కార్తికేయ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను వసతి గృహంలో ఉండలేనని ఇంటికి వచ్చేస్తానని తెలిపాడు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి నచ్చచెప్పి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం కార్తికేయ తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## ఇటుకల బట్టీల్లో బాల కార్మికులు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ఇటుకల బట్టీల్లో ఒడిశాకు చెందిన అనేక మంది బాల కార్మికులు పనిచేస్తున్నారు. తాటితూరు, నగరపాలెం, మజ్జివలస, మజ్జిపేట, లక్ష్మీపురం తదితర పంచాయతీల పరిధిలో ఇటుకల తయారీ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో కార్మికులుగా ఒడిశా నుంచి కాంట్రాక్టు పద్ధతిలో వస్తుంటారు. వారు తాత్కాలికంగా ఇటుకల తయారీ కేంద్రాల వద్దే నివాసం ఉంటూ పని చేస్తుంటారు. పెద్దలతో పాటు కుటుంబంలో ఉన్న వారంతా పని చేస్తుంటారు. ఈమేరకు ఆయా కేంద్రాల్లో వంద మంది వరకు బాల కార్మికులు ఉన్నట్టు ఇటీవల అధికారుల పరిశీలనలో తెలిసింది. వారి కోసం సర్వశిక్షా అభియాన్ అధికారులు బ్రిడ్జి పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. బాల కార్మికులతో పని చేయించడం చట్టరీత్యా నేరం. వారితో ఎవరు పని చేయించినా, కార్మిక శాఖాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు విమర్శిస్తున్నారు.

## 5న అనంతుని ఆలయ పునఃప్రారంభోత్సవం



పద్మనాభం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయ పునఃప్రారంభోత్సవాన్ని వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. బుధవారం వారు స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ఈఓ ఎస్.నానాజీబాబు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి ప్రజలను ఉత్సవాల్లో భాగస్వాములను చేయాలన్నారు. గిరిపై అయిదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ,మాజీ అధ్యక్షుడు నగేశ్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ నాయకులు రవికుమార్, శ్రీను, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి, ఏఎంసీ ఛైర్మన్ రామస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పీఎంపాలెంలో ఓ ఇంటి పైభాగంలో అల్లుకున్న తీగ మొక్కలు



మధురవాడలో ఓ ఇంటిపైన మొక్కలు

# మండు వేసవిలో క్రీపర్స్‌తో కూల్ కూల్

మధురవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనానికి అనేక విద్యుత్ ఉపకరణాలు ఉన్నా.. అవి కొంతవరకే ఊరట కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాలను క్రీపర్సు (తీగ మొక్కలు)తో చల్లంగా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం నర్సరీల్లో ఇంటిపైకి పాకే తీగ మొక్కలు లభ్యమవుతున్నాయి. వాటిని ఇంటి చుట్టూ ఉన్న మట్టిలో నాటితే ఏడాదిలోగా ఇంటి పైకప్పు వరకు పెరుగుతాయి. ఈ తీగలతో నిండిన ఇళ్లల్లో బయట ఉష్ణోగ్రతలు కంటే సుమారు 5 నుంచి 8 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్టు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అలాగే ఇంటి పైకప్పుపై గ్రీన్ నెట్ అమర్చి కుండీల్లో వివిధ రకాల మొక్కలు పెంచినట్లయితే అటువంటి ఇళ్లల్లో కూడా చల్లగానే ఉంటుంది.

### పచ్చని తోరణం

ఏడో వార్డులోని స్వతంత్రనగర్ కాలనీలో 25 ఏళ్ల కిందట వుడా మొక్కలు నాటింది. అవి ఎదిగి భారీ వృక్షాలుగా పెరిగాయి. కాలనీలోని అన్ని వీధుల్లో కాగు, వేప, కానుగ చెట్లు కనిపిస్తుంటాయి.మొత్తం 28 వీధుల్లో ఈ పచ్చదనం కనువిందు చేస్తోంది. మిథిలాపురి వుడా కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ చెట్లు కనిపిస్తాయి. వాటిని కూడా వుడా ఆధ్వర్యంలోనే నాటారు. ప్రస్తుతం ఈ చెట్ల కింద ఎంతో మంది సేదతీరుతున్నారు. అప్పట్లో దాట్ల సత్యనారాయణ రాజు అనే వ్యక్తి ప్రతి వీధిలోనూ దగ్గరుండి మొక్కలు నాటించారు. ఇప్పటికీ కాలనీవాసులు ఆయన్ను మొక్కలు రాజుగా గుర్తుంచుకున్నారు.



స్వతంత్రనగర్ కానీలో పచ్చని చెట్లు

## 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలు వచ్చే నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు తెలిపారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాసభలను ఈసారి ఉత్తర నియోజకవర్గం పరిధిలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. మురళీనగర్‌లోని బి స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో సభలు జరుగుతాయని చెప్పారు. 10న కంచరపాలెం మెట్టు నుంచి పాత ఐటీ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించి, అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 11న బి స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. పార్టీ గత మూడేళ్లలో నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించుకుని, వచ్చే మూడేళ్లలో చేయాల్సిన కార్యక్రమాలను రూపకల్పన చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, పాత్రపల్లి చంద్రశేఖర్, కె. సత్యనారాయణ, ఎస్‌కే రహమాన్, ఎం. మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

## 20న జిల్లా ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, ఆచార్య చెస్ అకాడమీ సంయుక్తంగా ఈ నెల 20న జిల్లా స్థాయి అండర్-7 బాలుర, బాలికల ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. నగరంలోని మాధవదార గాయత్రి విద్యామందిర్ వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనే చిన్నారులు జనవరి ఒకటి, 2018న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల చిన్నారులు ఈ నెల 19న మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫోన్: 80744 80434, 98493 71760 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న కేఎస్ఎనర్షు మూర్తి, కొరటాల ప్రభాకరరావు, వర్రే నాంచారయ్య ( కుడి నుంచి ఎడమకు

### కందుకూరి విశిష్ట పురస్కారాలు

కందుకూరి వేరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కందుకూరి విశిష్ట పురస్కారాలు అందించింది. విజయవాడ తుమ్మలాపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగిన సభలో కేఎస్ఎన్ మూర్తి, కొరటాల ప్రభాకరరావు, వర్రే నాంచారయ్యకు సినిమాటో గ్రఫీ మంత్రి దుర్గేష్ పురస్కారాలను ప్రదానం చేశారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

## నల్ల బ్యాడ్జీలతో విధులకు ఉపాధి సిబ్బంది

పద్మనాభం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులు నల్ల బ్యాడ్జీలతో బుధవారం విధులకు హాజరయ్యారు. ఎంపీడీఓ, ఏపీఓ నిర్వహించిన సమీక్ష సమావేశాలకు కూడా వారు అలానే వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను పంచాయతీ స్థాయి ఉద్యోగులుగా గుర్తించాలని, హెచ్ఆర్ పాలసీ, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, వేతనాలు పెంచాలని, మండలం యూనిట్‌గా అంతర్గత బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు జగదీశ్, వంకల సత్యం, బి. శ్రీను, శివన్నారాయణ, సన్యాసినాయడు, అప్పలనాయుడు, పాల్గొన్నారు.

### పరిశ్రమల భాగస్వామ్యంతో నూతన ఆవిష్కరణలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం అని డీఎస్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణకాంత్ పులిచెర్ల అన్నారు. బుధవారం గీతం యూనివర్సిటీలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎనేబ్లింగ్ సెంటర్ (జిటెక్) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత్ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 39వ స్థానంలో ఉందని, అంతర్జాతీయంగా పరిశోధన పబ్లికేషన్‌లో 3వ స్థానం దక్కించుకుందని చెప్పారు. స్టార్టప్‌ల రంగంలో ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలిచిందని 1.59 లక్షల స్టార్టప్‌లు దేశంలో 2025 నాటికి నెలకొల్పారని తెలిపారు. అయితే ఆవిష్కరణల ఫలితాలను ఉత్పత్తుల రూపంలో తీసుకువెళ్లే విషయంలో భారత్ వెనుకబడిందన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు మాట్లాడుతూ భారత్ ఇన్నోవేషన్ వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గౌతమ్ రావు, జిటెక్ కోఆర్డినేటర్ రాజాఫణిపప్పు, జిటెక్ సలహాదారు డి .యోగేశ్వరరావు, కె. సుభోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చందనోత్సవం సమీక్షకు ఆహ్వానం లేదు

**- మాడుగుల ఎమ్మెల్యే బండారు**

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై స్వామివారి చందనోత్సవం ఏర్పాట్ల గురించి బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి అధికారులు గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలను ఆహ్వానించలేదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ సమావేశానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధికి అందర్నీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు చెబుతున్నా, ఈ సమావేశానికి ఎవర్నీ పిలవలేదన్నారు.

# కన్న తండ్రే కాలయముడై!

... 5వ పేజీ తరువాయి

తగరపువలస పాతసినిమాహాలు జంక్షన్ వద్దకు వెళ్లిన తర్వాత ఒక దుకాణం ముందు వేసిన రేకులషెడ్‌లో పిల్లలను నిద్రపుచ్చాడు. అక్కడ బళ్లారి నుంచి పప్పులోడుతో వచ్చిన లారీ తగరపువలసలో కొంత, విజయగరంలో కొంత సరకు అన్‌లోడ్ చేయాల్సి ఉండడంతో పిల్లలను నిద్రపుచ్చిన దుకాణం ముందు ఆపారు. తగరపువలస మార్కెట్‌కు మంగళవారం సెలవు కావడంతో లారీ అక్కడే ఉండిపోయింది. కుమారుడు, కుమార్తె నిద్రపోతుండగా మద్యం మత్తులో ఉన్న తండ్రి విచక్షణ మరిచి తన నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక బిగ్గరగా ఏడుస్తుండగా, పక్కనే ఆగివున్న లారీలో వంట చేసుకుంటున్న సిబ్బంది విన్నారు. ఏం జరిగిందో చూసిరావాలని లారీ డ్రైవర్ కమ్ ఓనర్ క్లీనర్‌ను పంపించాడు. అతడు వెళ్లిచూసేసరికి బాలికపై ఆ వ్యక్తి లైంగికదాడి చేస్తుండడంతో జాతీయరహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనాలను ఆపి విషయం చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారంతా కన్నడంలో మాట్లాడుతుండడం, తెలుగు రాకపోవడంతో ద్విచక్రవాహదారులకు అర్థం కాలేదు. చివరకు ఒక వ్యక్తి సమీపంలోని బ్యాంకు సెక్యూరిటీ గార్డు వద్దకు వెళ్లి విషయం చెప్పగా, తనకు తెలిసిన హోంగార్డుకు సమాచారం ఇచ్చాడు. అతడు తగరపువలసలో ఉన్న కానిస్టేబుల్‌కు చెప్పడంతో అతడు వెళ్లి చూసేసరికి బాలిక తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతోంది. దీంతో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నిర్మలకు సమాచారం అందించాడు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని బాలికను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పక్కనే నిద్రపోతున్న ఏడేళ్ల బాలుడిని తల్లి వద్దకు, నిందితుడిని భీమిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని మహిళా పోలీసుస్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు బుధవారం ఉదయం పరిశీలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, మహిళా పోలీసుస్టేషన్‌కు అప్పగించామని సీఐ తిరుమలరావు తెలిపారు.

## నాలుగేళ్లలో రూ.వందల కోట్ల దోపిడీ

**- జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్**

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నాలుగేళ్లలో రూ. వందల కోట్లు దోచుకున్నారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. హోటల్ మేఘాలయలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ భర్త శ్రీనివాసరావు షాడో నేతగా వ్యవహరిస్తూ భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. మేయర్ క్యాంప్ కార్యాలయం కోసం కొనుగోలు చేసిన వందకుపైగా కుర్చీలు, సోఫాలు, టేబుళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇసుకతోటలో వసుదేవ ఫంక్షన్ హాల్ పేరుతో ప్లాన్‌కు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మించారని, జీవీఎంసీ పన్ను కూడా విధించలేదన్నారు. ఆరిలోవలో మరో లాడ్జిని భారీగా నిర్మించారన్నారు. క్యాంప్ కార్యాలయం కోసం నాలుగేళ్ల కిందట నిర్మించిన షెడ్ స్థానంలో ఇప్పుడు భారీ భవనం వెలిసిందని, మేయర్ ఉంటున్న ఇంటి ఆవరణలోనే అక్రమ భవన నిర్మాణం జరుగుతోందని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నగరంలో ఎనిమిది చోట్ల యోగా సెంటర్ల పేరుతో మసాజ్ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. స్నేహితుడికి సహాయం చేస్తానని చెప్పి రూ. 65 లక్షలు కాజేశారని ఆరోపించారు. వారి అవినీతి కారణంగానే కూటమి ప్రభుత్వం అవిశ్వాసం పెట్టిందన్నారు. అన్ని ఆరోపణలకు తన వద్ద ఉన్నాయని చెప్పారు.

# రైతుబజార్ ఏర్పాటుకు స్థల సేకరణ

**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

ఎండాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ, మధురవాడ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఐదు ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఎండాడలోని ఎంకే గోల్డ్ కోస్ట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి రాగానే ఎండాడ, మధరవాడ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. నగరంలోని సంపత్ వినాయక రోడ్డుకి దీటుగా ఎండాడ డబుల్ రోడ్డు అభివృద్ధి చెందుతుందన్నారు. ఎండాడలో రైతు బజార్ ఏర్పాటు చేస్తామని, అందుకు అవసరమైన స్థల సేకరణ జరుగుతుందని వివరించారు. అలాగే మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు కొలువు తీరనున్నాయని, అలాగే కొత్తగా ఆరు స్టార్ హోటల్స్ కూడా రానున్నాయని చెప్పారు. ఇక్కడికి మరిన్ని బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఎంకే గోల్డ్ కోస్ట్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

# వైసీపీ కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తాం

**పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్**

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోసం ఈనెల 19న జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నేపథ్యంలో తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీచేస్తున్నామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం జరిగే ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. మద్దిపాలెంలోని పార్టీ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీలో కూటమికి బలం లేకపోయినా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో 58 మంది వైసీపీ కార్పొరేటర్లకు విప్‌జారీ చేస్తున్నామని, ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ బీసీ జనరల్‌కు ఈ పదవి రిజర్వు చేసినా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇచ్చారన్నారు. యాదవ సామాజిక భవనం కోసం ఎండాడలో భూమి కేటాయించారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మేయర్ పీఠం నుంచి దింపేయాలని కుట్ర పన్నుతోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

అశోక్ గజపతిరాజు దర్శనం ఆనంతరం మూడు గంటల నుంచి సామన్య భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అదే సమయంలో వీవీఐపీలు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉదయం 5 గంటల్లోగానే అంతరాలయాల దర్శనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రూ.1,500 టికెట్ తీసుకున్న అధికారులు, మంత్రులకు అనివార్య కారణాల వల్ల ఉదయం రాలేకపోతే సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తామన్నారు. చందనోత్సవానికి లక్షమంది పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి భక్తుడు దర్శనం చేసుకుని, బయటకు రాగానే పులిహోర, దద్దోజనం, లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించాలని, నిత్యాన్నదానం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్, వీల్‌ఛైర్స్ ఏర్పాటుచేయాలన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ క్యూలైన్ పరిధి పెంచడంతో పాటు సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రూ.1,500 టికెట్లను మా బంధువులకు ఇచ్చి, దర్శనానికి పంపిస్తే అవి నకిలీవిగా తేలిందని, ఈ సారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా ప్రవేశమార్గంలోనే టికెట్లు పరిశీలించేలా చూడాలన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సామన్య భక్తులకు సంతృప్తిగా దర్శనమయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా పోలీసు, దేవదాయశాఖలో దైవభక్తి ఉన్న ఉద్యోగులను మాత్రమే వీఐపీ మార్గంలో ఉంచాలన్నారు. దురుసుగా ప్రవర్తించేవారిని ఎట్టి పరిస్థితుల్లో నియమించవద్దని, అధికారులు తమ బంధువులు, సిబ్బందిని క్యూలైన్ల మధ్యలోకి పంపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రొటోకాల్ కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పుసపాటి అశోకగజపతిరాజు మాట్లాడుతూ సామన్య భక్తులకు సత్వరం దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆగమశాస్త్ర నిపుణలను సంప్రదించి వారు ఏ సమయానికి రమ్మంటే అదే సమయానికి తాను దర్శనానికి వస్తానన్నారు. దేవదాయశాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ మాట్లాడుతూ భక్తుల క్యూలైన్ మోనటరింగ్, ఎంత సమయానికి ఎంత మంది భక్తులు దర్శించుకున్నారనే వివరాలు, ప్రత్యేక బారికేడ్లు, తదితర చర్యలు చేపడుతున్నట్టు తెలియజేశారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్ మాట్లాడుతూ మల్టిపుల్ క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సింహాచలం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు మాట్లాడుతూ క్యూలైన్ పొడువు పెంచుతామని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

# జడ్పీ పనులకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

కోరారు. ఇందుకు సమావేశం ఆమోదించింది.

### కేజీహెచ్‌లో ప్రతిరోజూ సూపర్ స్పెషాలిటీ సేవలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు శివానంద్ మాట్లాడుతూ, కేజీహెచ్‌లో వారం రోజులపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మార్చురీ గది వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేశామన్నారు. వేసవిలో వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించడం కోసం ఆరు బెడ్లతో ఉన్న ఏసీ గదిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా ఓపీ కౌంటర్లు ఓపెన్ చేశామని చెప్పారు.

### జలజీవన్ మిషన్ పనులపై గోప్యత ఎందుకు?

జిల్లాలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులపై గోప్యత ఎందుకని, సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వడంలేదని ఛైర్‌పర్సన్ సుభద్ర అధికారులపై మండిపడ్డారు. పద్మనాభం మండలం నేరేళ్లవలసలో సచివాలయ భవన నిర్మాణం కోర్టు వివాదాలతో నిలిచిపోయిందని జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామని విశాఖ జేసీ మయూర్ అశోక్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అరకులోయ ఎంపీ తనూజరాణి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, 'సామాజిక' కార్పొరేషన్ల ఛైర్మన్లు పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

మాత్రం కూటమి ప్రజాప్రతినిధులు, నేతల పేర్లు చెప్పి, అధికారులను ప్రసన్నం చేసుకుని మార్కెట్‌లో ఆశీలు వసూలు ప్రక్రియను తన చేతుల్లోకి తీసేసుకున్నారు. అంతేకాకుండా ఆశీలు వసూలు ప్రారంభించిన మొదటిరోజే పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, పార్కింగ్ స్థలంలోనూ దుకాణాలను ఏర్పాటుచేయిచారు. దీంతో మార్కెట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌కు సమస్య తలెత్తింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమవడంతో పోలీసులు మెయిన్‌రోడ్డుతోపాటు మార్కెట్ చుట్టూ ఉన్న రోడ్లపై ఆక్రమణలు తొలగించారు. కానీ జోన్-4 అధికారులు డిపార్టుమెంట్ కలెక్షన్ పేరుతో కాంట్రాక్టర్‌తోనే ఆశీలు వసూలు చేయిస్తున్నారు. ఇదిలావుండగా వేలం సమయంలో జోన్-4 అధికారులు విడుదల చేసిన గెజిట్‌లో ఆశీలు వసూలుకు పూర్ణామార్కెట్ తూర్పున ప్రధాన రహదారి, దక్షిణం వైపు వస్త్ర దుకాణాలు, పడమరవైపు పండ్లరసం దుకాణం, ఉత్తరం వైపున స్నేహ ఫుట్‌వేర్ దుకాణం మధ్య ఉన్న దుకాణాలు, మార్కెట్‌లోపల దుకాణాల నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ కాంట్రాక్టర్ జగదాంబ జంక్షన్ సమీపంలోని టర్నర్‌చౌల్ట్రీ నుంచి కొత్తరోడ్డు వరకు, పూర్ణామార్కెట్ బస్టాప్ నుంచి సీహార్స్‌జంక్షన్ వరకు, రవిబుక్ షాప్ నుంచి పందుంపుళ్లసందు వరకు ఉన్న దుకాణాల నుంచి ఆశీలు వసూలుచేస్తున్నారు. పూర్ణామార్కెట్‌లోకి వచ్చిపోయే వాహనాల నుంచి ఆశీలు వసూలు చేయాల్సి ఉండగా, వన్‌టౌన్‌లోని సగం ప్రాంతాలకు వచ్చే అన్నిరకాల గూడ్స్ వాహనాల నుంచి ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జోన్-4 అధికారులు కాంట్రాక్టర్‌కు అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పైగా ఇటీవల ఒక వ్యాపారి గెజిట్‌లోని సరిహద్దులకు మించి ఆశీలు వసూలు చేస్తున్నారంటూ జోన్-4 అధికారులకు ఫిర్యాదుచేసినా కనీసం చర్యల్లేకపోవడంతో అధికారులకు భారీగా ముడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ దృష్టిసారించి కాంట్రాక్టర్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని వ్యాపారులు కోరుతున్నారు.



తీరం వద్ద గట్టుపై నిద్రిస్తున్న బడుగుజీవులు



బీచ్ రోడ్డులో ఇది ఇలాంటి దృశ్యాలు మామూలే..

# అభాగ్యులకు ఏదీ ఆసరా?

- నగరంలో దయనీయంగా దీనుల పరిస్థితి
- షెల్టర్లు ఉన్నా.. కనీస సౌకర్యాలు లేని దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వాలు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు' అన్న నానుడి ఈ చిత్రాలు చూస్తే గుర్తుకు వస్తుంది. ఓ సగటు ప్రయాణికుడు, అభాగ్యులు, బడుగు జీవి ఎలాంటి సౌకర్యాలు లేకుండానే నిద్రిస్తున్న దృశ్యాలు ఆర్కే బీచ్‌లో కనిపిస్తున్నాయి. నగరంలో రైల్వేస్టేషన్ వద్ద తాము ఎక్కాల్సిన బండి రావడానికి సమయం ఉందని తెలియగానే ప్రయాణికులు అక్కడికక్కడే నడుం వాల్చేస్తుంటారు.

'అటెన్షన్ ప్లీజ్..! అంటూ రైల్వేశాఖ అప్రమత్తం చేసే సూచనలను ఓసారి అలా వినేసి, వెనువెంటనే తల కింద చెయ్యిపెట్టుకొని మగతగా కళ్లు మూసుకుంటారు. వీరే కాదు.. నగరంలో ఏ గూడు లేని కొందరు అభాగ్యులు సైతం పగలంతా ఎక్కడెక్కడో తిరిగినా రాత్రి కాగానే, ఆ పరిసరాల్లో కునుకు తీస్తుంటారు. సాగర తీరం సమీపంలోని బస్టాప్‌ల వద్ద సైతం ఆ చల్లదనానికి సాంత్వన పొందేవారెందరో?

### దీనులను పట్టించుకునే వారే కరువు


నగరంలో ఎందరో అభాగ్యులు సేద తీరడానికి చోటు లేక రోడ్ల పక్కన, బస్టాపులు, చెట్ల కింద పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొందరు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేసేవారు. అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, పిల్లలకు చదువుల ఉపకరణాలు అందజేస్తుండేవారు. ప్రస్తుతం అనాథలను చేరదీసేవారు కరవయ్యారు. దీంతో అనాథ పిల్లలు దిక్కుతోచని పరిస్థితుల్లో బాల్యంలోనే చెడు అలవాట్లకు లోనై, వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

### నాలుగేళ్ల తరువాత తల్లి చెంతకు..

మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఓ ఎన్జీవో చికిత్స అందించి తల్లి చెంతకు చేర్చారు. నాలుగేళ్ల తరువాత తల్లి, కుమారుడు కలుసుకున్నారు. మహారాష్ట్రలోని ఇంగోలి జిల్లా పరిధి గోరేగావాకు చెందిన వాసుదేవ్ అనే వ్యక్తి మానసిక వ్యాధితో బాధ పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం ఇంటి నుంచి వచ్చేసిన వాసుదేవ్ కొన్నాళ్లు వేర్వేరు ప్రాంతాల్లో తిరిగి గత ఏడాది అక్టోబరు 5న విశాఖపట్నానికి చేరుకున్నాడు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో ఓ ఎన్జీవో సిబ్బంది గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోంకు తరలించాడు. అనంతరం ఆ ఎన్జీవో సభ్యులు వాసుదేవ్‌ను అతని స్వగ్రామంలో తల్లి కృష్ణబాయికి అప్పగించారు. నాలుగేళ్ల తరువాత కొడుకును చూసి చాలా సంతోషించిందని తెలిపారు.

### ఉచిత ఆశ్రయం ఉన్నా..

ఉపాధి వెతుక్కుంటూ విశాఖపట్నం వచ్చి ఆశ్రయం లేక ఇబ్బంది పడుతున్నవారికి నగర పాలక సంస్థ ఓ చక్కటి వసతి కల్పిస్తోంది. అయితే, అక్కడ సౌకర్యాలు సరిగా లేక చాలామంది అభాగ్యులు ఉండడానికి ఇష్టపడడం లేదు. పాతబడిన భవనం, కనీస వసతి సౌకర్యాలు లేని ఆ భవనంలో ఉండడానికి భయపడుతూ బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో ఉంటున్నారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద వసతి కల్పించడానికి నిధులు ఉన్నా, ఆశ్రయం నిర్మించకుండా నగర పాలక సంస్థ అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు చొరవ తీసుకొని అనాథలకు ఆశ్రయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న వృద్ధుడు

# జియో సింథటిక్‌తో బహుళ ప్రయోజనాలు

- వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్



సదస్సులో పాల్గొన్న వినయ్‌కుమార్, పలువురు ఇంజనీరింగ్ నిపుణులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జియో సింథటిక్స్ వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ ఎం. వినయ్‌కుమార్ పేర్కొన్నారు.ఆంధ్ర యూనివర్సిటీసివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ విశాఖ ప్రాంతీయ కేంద్రం, మెక ఫెరి సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. 'నర్చరింగ్ ద నేషన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విత్ సస్టైనబుల్ జియో సింథటిక్ సొల్యూషన్స్' అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవ మేథస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందన్నారు. గత మూడు శతాబ్దాలుగా దీని ప్రాధాన్యం పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖలోని తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు. యువ ఇంజనీర్లు ఈ రంగాన్ని తమ కెరీర్‌గా మలచు కోవడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. నిపుణులు సుస్థిర పరిష్కారాలను అందించాలని సూచించారు. మెకఫెరి సంస్థ బిజినెస్ హెడ్ గిన్లుకా స్పాదారో మాట్లా డుతూ పర్యావరణం అనేక నూతన సవాళ్లను విసురుతోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి లభ్యత తక్కువగా ఉండడం, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు నిర్మాణ రంగానికి సవాళ్లుగా మారుతున్నాయన్నారు. భవిష్యత్‌లో నీటి వనరుల నిర్వహణ కీలకంగా మారుతుందన్నారు. జియో సింథటిక్స్ ఉపయోగించి సుస్థిరమైన పరిష్కారాలను అందించవచ్చన్నారు. ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ విశాఖపట్నం కేంద్రం ఛైర్మన్, ఏయూ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన ప్రాజెక్టుల నిర్మాణంలో జియో సింథటిక్స్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా జియో సింథటిక్ ఉపయోగిస్తూ పటిష్టమైన, తక్కువ ఖర్చుతో నిర్మాణం పూర్తి చేసి దీర్ఘకాలం మన్నే నిర్మాణాలు చేయడం సాధ్యపడుతుందన్నారు.

కార్యక్రమంలో మెకఫెరి టెక్నికల్ హెడ్ రత్నాకర్ మహజన్, జియో సింథటిక్స్ బిజినెస్ విభాగం హెడ్ సౌర్యదాస్, ప్రొఫెసర్ రాజ గోపాల్, ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు. సదస్సులో పరిశ్రమల నిపుణులు, సివిల్ ఇంజనీరంగ్ ప్రొఫెసర్లు, వివిధ కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# భవిష్యత్తు అంతా ఏఐ ఆధారితమే

- ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ ధనుంజయరావు, పలువురు ఆచార్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు పూర్తిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నడుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'బిల్డ్ భారత్ హ్యాకథాన్' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ధనుంజయరావు మాట్లాడుతూ యువత మేధస్సుకు పదును పెట్టేలా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. సృజనాత్మకంగా పని చేస్తూ నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఇటువంటి హ్యాకథాన్‌లో భాగస్వామ్యం కావడం వల్ల యువతలో కోడింగ్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని, యువత ఇక్కడి నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజ నీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కుంజం నాగేశ్వరరావు, ప్రొఫెసర్ వి.వల్లి కుమారి, డాక్టర్ జి. లావణ్యదేవి, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరరావు, డిజిపాక్ సీఈవో అమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంచుకొని పరారీ

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో ఉన్న సేవాన లలిత (90) అనే వృద్ధురాలు బుధవారం సాయంత్రం ఇంటి బయట ఆరేసిన దుస్తులు తీస్తుండగా. మాస్క్ పెట్టుకున్న ఓ వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల విలువైన గొలుసును తెంచుకుపోయాడు. ఆమె కేకలు విన్న లలిత సోదరి, చుట్టు పక్కల వారు వచ్చేలోగానే దొంగ పరారయ్యాడు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇటీవల ఈ ప్రాంతంలో చైన్‌స్నాచింగ్‌లు జరుగుతుండడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్దిలపాలెం చైతన్యనగర్, శివాజీపాలెం ప్రాంతాల్లో జరిగిన చోరీలు మర్చిపోకముందే.. తాజా సంఘటన జరగడం చర్చనీయాంశమైంది.

## సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులకు గురైన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయం పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబాలకు బుధవారం వీటిని అందించారు. రాంనగర్ ప్రాంతానికి చెందిన గోగినేని సత్యనారాయణ రూ. 32,500లు, ఈస్ట్‌పాయింట్ కాలనీకి మారపు సత్యవతి రూ. 84,950లు, పదోవార్డు పరిధిలోని సుందర్‌నగర్ ప్రాంతానికి చెందిన మామిడి రమాదేవికి రూ. 300,677 చొప్పున మంజూరయ్యాయి. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నక్క కనకరాజు, కాళ్ల శంకర్, బుగత సత్యనారాయణ, మద్దిల రాజేష్, మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,
- మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)
- పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వరౌర్య (గోపాలపట్నం), తాతా(తగరపువలస)

కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు)18,వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 36, కంద 64,దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 425 |
| విజయనగరం | 429 |
| శ్రీకాకుళం | 429 |

| చికెన్ ధరలు బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

# ఇసుకతోట నుంచి హనుమంతవాక వరకు ట్రాఫిక్ జాం

- ఇసుకతోట వద్ద ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం
- గంట పాటు వాహనదారుల అవస్థలు



ఇసుకతోట వద్ద నిలిచిపోయిన వాహనాలు



వెంకోజీపాలెం-మద్దిలపాలెం మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట ఐవోసీ పెట్రోల్ బంకు వద్ద గెడ్డ మరమ్మతులు నిర్వహించడం, అదే ప్రాంతంలో ఓ ఆర్టీసీ బస్సు మరమ్మతుకు గురై నిలిచిపోవడంతో బుధవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జాం అయింది. ఇసుకతోట నుంచి హనుమంతవాక వరకు ఒక ప్రక్క ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రాఫిక్ గంట పాటు నిలిచిపోవడంతో చిన్నారులు, వృద్ధులతో ఉన్న వాహనదారులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ఆపసోపాలు పడ్డారు.

## 23న ఎస్.జానకి సినీ సంగీత విభావరి

- పోస్టర్ ఆవిష్కరించిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న ఆమె పాటలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు 'యాక్మి' అధ్యక్షుడు ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'యాక్మి' ప్రతాప్ మాట్లాడుతూ జయంతి చౌదరి క్రియేషన్స్, ఎంవీఆర్ ఈవెంట్స్, 'యాక్మి' సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఎస్.జానకి పాడిన సినీ గీతాలతో సినీసంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా సంగీత సహకారంతో జరగనున్న సంగీత విభావరిలో ఈటీవీ స్వరాభిషేకం సింగర్స్ మాళవిక, హితేష్ సాయిలతో పాటు పలువురు జానకి ఆలపించిన గీతాలను వినిపిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఫ్లూట్ మాస్ట్రో తాళూరి నాగరాజు, మణి నాగరాజు దంపతులను ఘనంగా సత్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంటా శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా ఆదాయపు పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ పి.శేషగిరిరావు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంతన్యాయమూర్తి డి.పద్మారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

### మానసిక వైద్యశాలకు బాలిక తరలింపు

ఆరిలోవ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వ్యాలీ స్కూలు సమీపంలో గల బాలికల ప్రత్యేక హోంలో ఉన్న ఒక బాలికకు మానసిక సమస్యతో ఉన్నట్టు గుర్తించి ఆమెకు మెరుగైన చికిత్స కోసం బుధవారం మానసిక వైద్యశాలకు పోలీసుల సహకారంతో పంపించినట్టు ప్రభుత్వ బాలికల ప్రత్యేక హోం సూపరింటెండెంట్ సునీత తెలిపారు. ఆ బాలిక భీమిలిలో గల కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్టు తెలిపారు. అక్కడ ఆమె ప్రవర్తన లో మార్పు రావడంతో ఆ బాలికలను ప్రభుత్వ బాలికను ప్రత్యేక హోంకు పంపించారు. ఈ బాలిక మానసిక పరిస్థితి బాగా లేక పోవడంతో మెరుగైన వైద్యం కోసం మానసిక వైద్యశాలకు తరలించారు. ఆ బాలిక విజయవాడకు చెందినదని, అనాథ అని బాలికల ప్రత్యేక హోం సూపరింటెండెంట్ సునీత తెలిపారు.

# పేదలకు ఇళ్లు కేటాయించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సిరిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో దశాబ్దాల తరబడి సొంతిల్లు లేని పేదలకు ఇల్లు లేదా రెండు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేదలకు ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలం లేక, అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులకు ఏ మాత్రం పట్టడం లేదన్నారు. గత 15 ఏళ్లుగా ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించినప్పటికీ నేటికీ సొంతింటికి నోచుకోలేదన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు, గత ప్రభుత్వం వైసీపీ జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు. కొంతమంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు. ఇందులో అనేక మంది అప్పులు చేసి డీడీలు కట్టారన్నారు. కానీ ఇళ్లను అందజేయలేదన్నారు. ర్యాలీ అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.గ్గునాయుడు, కుమార్, జగన్, మణి, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పైడా కౌషిక్ నాటకోత్సవాలు

- ఆకట్టుకున్న 'రాత' నాటిక



నాటకంలో ఓ ఆసక్తికర సన్నివేశం

మద్దిలపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతిలో నిర్వహిస్తున్న పైడా కౌషిక్ నాటకోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజైన బుధవారం శ్రీనివాసరావు దర్శకత్వంలో 'రాత' నాటకాన్ని ప్రదర్శించారు. మనిషికి కష్టం వస్తే నా రాత ఇంతేనని వదిలేస్తాడు. సుఖం కలిగితే రాత విషయం పట్టించుకోడు. ఇలాంటి వ్యక్తుల వల్ల సమాజం ఎటు పోతోందని, దీనికి ఎవరి రాత కారణమని సందేశాత్మకంగా కళాకారుల చక్కని ప్రదర్శనతో ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. తొలుత ముఖ్య అతిథులు సింబియాసిస్ సీఈవో ఒ.నరేష్, కళాభారతి అధ్యక్షుడు సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. నాటకాల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే నాటక ప్రదర్శనలకు సహకరించిన సభ్యులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, జి.పవన్‌కుమార్, డాక్టర్ కేజీ వేణు, పి.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

## అగ్రనేతలపై అక్రమ చార్జిషీట్లు తొలగించాలంటూ కాంగ్రెస్ నేతల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్య నాయకులపై పెట్టిన అక్రమ చార్జిషీట్లు, నేషనల్ హెరాల్డ్ ఆస్తుల కేసుకు సంబంధించి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకొంటోందని ఆరోపిస్తూ విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మ రాజు అధ్యక్షతన బుధవారం ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వర్మరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అణగ దొక్కడానికి బీజేపీ ఇటువంటి కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అక్రమ కేసులను ఎత్తివేయాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీసీసీ జనరల్ సెక్రటరీ, శ్రీకాకుళం ఇన్‌చార్జి గాదం మహేష్, కాంగ్రెస్ సీనియర్ నేతలు వేగి వెంకటేష్, సోడదాసి సుధాకర్, కేవీ సూర్యనారాయణ, బుకారి మహమ్మద్, సవరపల్లి రామకృష్ణ, రజనీకాంత్, బి.వెంకటరమణ, సబ్బవరకు శ్రీధర్, పద్మిని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, త్రినాధరావు, మహమ్మద్ అలీ కనేమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 20న జిల్లా ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, ఆచార్య చెస్ అకాడమీ సంయుక్తంగా ఈ నెల 20న జిల్లా స్థాయి అండర్-7 బాలుర, బాలికల ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ టోర్నీ నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. నగరంలోని మాధవధార గాయత్రి విద్యామందిర్ వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనే చిన్నారులు జనవరి ఒకటి, 2018న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల చిన్నారులు ఈ నెల 19న మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫోన్: 80744 80434, 98493 71760 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## పాలీసెట్ దరఖాస్తుకు ఆఖరు రోజు నేడు

కంచరపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలీసెట్) ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును గురువారం సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. సాంకేతిక శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలిపారు. వాస్తవానికి పాలీసెట్ దరఖాస్తు గడువు 14వ తేదీతో ముగియగా, దీనిని 17వ తేదీ వరకు పొడించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలీసెట్ జరగనుంది.

## పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య విద్యార్థులకు పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. మహిళల కేటగిరీలో ఇంజనీరింగ్ విద్యార్థిని జి.సి.ఆర్.అనూష రెండు పతకాలు సాధించగా, పురుషుల విభాగంలో డిగ్రీ విద్యార్థులు పి.భార్గవ్ రెండు స్వర్ణ పతకాలు, ఐ.ప్రవీణ్‌కుమార్ రజత పతకం, బి.వి.రేవంత రెడ్డి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తన కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్. లక్ష్మణరెడ్డి, గంగాభవాని పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం బజారు, రైల్వే క్వార్టర్స్, రైల్వే ఆక్వా స్పోర్ట్స్ ఏరియా, రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, శివాలయం, రామాలయం వీధులు, వెంకటేశ్వర కాలనీ, ఎనభై అడుగుల రోడ్డు, పట్నాయక్ వీధి, 28 బస్టాప్ రోడ్డు, కారుణ్యాయి పెట్రోల్ బంకు ఏరియా, పరదేశమ్మ ఆలయం, సంతోషిమాత ఆలయాల పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.





# ఘనంగా ముత్యమాంబ తొలేళ్లు



కంచరపాలెం మెట్టు వద్ద విద్యుత్ వెలుగుల్లో ముత్యమాంబ ఆలయం



అమ్మవారి ప్రతిమను మోస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు వద్ద కొలువై ఉన్న గవర కంచరపాలెం గ్రామదేవత ముత్యమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ సంప్రదాయం ప్రకారం భక్తులు, గ్రామస్థులు తొలుత దొండపర్తి ఎరుకుమాంబ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి అమ్మవారి ప్రతిమలతో దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం మీదుగా గవర కంచరపాలెంమెట్టు వద్ద గల అమ్మవారి గుడికి ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం భక్తులు అమ్మవారి ప్రతిమలను ఇళ్లకు తీసుకుని వెళ్లారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దొండపర్తి వద్దకు చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమను తలపై మోశారు. తొలేళ్ల పండగ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముత్యమాంబ ప్రధాన పండగ గురువారం జరుగుతుంది. మెట్టు వద్ద గల అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ కాంతులు, మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రధాన పండగ సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కంచరపాలెం మెట్టు వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం అలరించనున్నాయి.

## పేదలకు ఇంటి స్థలం, ఇల్లు ఇవ్వండి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పేదలకు పక్కా ఇల్లు, లేదంటే స్థలం మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేదలకు ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆశీల్‌మెట్ట మీదుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇళ్లు లేని వారిని 15 ఏళ్ల కిందటే గుర్తించినప్పటికీ ఇంతవరకు సొంతిళ్లు అందజేయకపోవడం దారుణమన్నారు. మూడు నెలలుగా కమిషనర్ పోస్టును భర్తీ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడంపై మండిపడ్డారు. మేయర్ పదవి కోసం రాజకీయాలకు తెరలేపి పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కార్పొరేటర్లు ఆ బాధ్యతను విస్మరించి క్యాంపుల పేరుతో విదేశాల్లో విహరిస్తున్నారన్నారు. నగరంలో సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, కార్పొరేటర్ ఎం. గంగారావు, నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మే 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలు వచ్చే నెల 10, 11తేదీల్లో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మురళీనగర్ బి స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శిఎం.పైడిరాజు తెలిపారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10న కంచరపాలెం మెట్టు నుంచి పాత ఐటీ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన అనంతరం బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. 11న జరిగిన ప్రతినిధుల సభలో వచ్చే మూడేళ్లలో చేయాల్సిన కార్యక్రమాలకు రూపకల్పన చేసుకుంటామన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు అత్తిలి విమల, పాత్రపల్లి చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, ఎస్‌కే రహమాన్, ఎం.మన్మథరావు పాల్గొన్నారు.

## 12 మందికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏయూటీడీ, ఆర్పీఎఫ్ సిబ్బంది రైల్వేస్టేషన్ పరిసరాల్లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన దీనస్థితిలో ఉన్న 12 మందిని గుర్తించి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ వసతిగృహాలకు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగఢ వాసు తెలిపారు. మాధవ (55), సిరామ్ (50), శ్రీనివాసరావు (45), సాయిబాబా (50), మల్లు (45), వెంకటరావు (55), గోపాల్ (65), శంకర్ (45), నాగరాజు (55), సింహాచలం (50), సుధాకర్ (45), దేవ (70)లుగా గుర్తించి పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు.

# నాలుగేళ్లలో రూ.వందల కోట్లు దోచుకున్నారు

మేయర్, డిప్యూటీ మేయర్‌పై కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆరోపణ

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నాలుగేళ్లలో రూ. వందల కోట్లు దోచుకున్నారని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. హోటల్ మేఘాలయలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేయర్ భర్త శ్రీనివాసరావు షాడో నేతగా వ్యవహరిస్తూ భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. మేయర్ క్యాంప్ కార్యాలయం కోసం కొనుగోలు చేసిన వందకుపైగా కుర్చీలు, సోఫా లు, టేబుళ్లు ఏమైపోయాయని, మేయర్ ఇంట్లో ఖరీదైన గృహోపకరణాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఇసుకతోటలో వసుదేవ ఫంక్షన్ హాల్ పేరుతో ప్లాన్‌కు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మించారని, దానికి జీవీఎంసీ పన్ను కూడా విధించలేదన్నారు. ఆరిలోవలో మరో లాడ్జిని భారీగా నిర్మించారన్నారు.

క్యాంప్ కార్యాలయం కోసం నాలుగేళ్ల కిందట నిర్మించిన షెడ్ స్థానంలో ఇప్పుడు భారీ భవనం వెలిసిందని, మేయర్ ఉంటున్న ఇంటి ఆవరణలోనే అక్రమ భవన నిర్మాణం జరుగుతోందని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నగరంలో ఎనిమిది చోట్ల యోగా సెంటర్ల పేరుతో మసాజ్ సెంటర్లు ఏర్పా టు చేశారన్నారు. స్నేహితుడికి సహాయం చేస్తానని చెప్పి రూ. 65 లక్షలు కాజేశారని ఆరోపించారు.

ఎన్ఏడీ జంక్షన్ సమీపంలో గోంగూర హోటల్‌ను ఆనుకుని గ్రీన్ బెల్ట్‌లో ఉన్న 550 గజాలు స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేసి విక్రయానికి పెట్టారని తెలిపారు. వారి అవినీతి కారణంగానే కూటమి ప్రభుత్వం అవిశ్వాసం పెట్టిందన్నారు. ఆరోపణలకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని, కాదంటే డిప్యూటీ మేయర్ రుజువు చేయాలని సవాల్ చేశారు.

# ప్రతీకార చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు

» ఈడీ బీజేపీ జేబు సంస్థగా మారింది : కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ » కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ అన్నారు. బీజేపీ కక్షపూరిత రాజకీయాలు ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ సర్కిల్‌లో చింతామోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈడీ డౌన్..డౌన్ అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈడీ బీజేపీ జేబు సంస్థగా మారిందన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీపై కేసు పెట్టడం దౌర్భాగ్యం, అమానుషమన్నారు.ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీని గౌరవించాలని కోరారు. కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వంటి అగ్రనాయకులను అణగదొక్కాలని చూస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతులు నొక్కాలని కుట్రలు చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతీకార చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. బీజేపీ వేధింపులను, దుశ్చర్యలను చూస్తూ ఊరుకోమని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు గారా సూర్యారావు, కేవీ సూర్యనారాయణ, అబిదా, నర్సరీన్, మహ్మద్ హర్షద్‌భాష, దేవా, డాక్టర్ రాఘవులు, డాక్టర్ రంగనాథరాయ్ తదితరులు పాల్గొన్నారు.




ఈడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తదితరులు

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలపై అవగాహన అవసరం

మురళీనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల అపార్ట్‌మెంట్ల నివాసితులకు కనీస అవగాహన ఉండాలని మర్రిపాలెం (బర్మాక్యాంప్) సహాయ అగ్నిమాపక శాఖాధికారి కె.వి.టి.ప్రసాదరావు సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారణకు ఇళ్లల్లో వైరింగ్ తనిఖీ చేసుకోవడం నుంచి, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏసీ, ఫ్రిజ్ తదితరాల నిర్వహణ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. వంటగదిలో గ్యాస్ సిలిండర్ల పట్ల అవగాహన, ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలపై అందరికీ తెలిసి ఉండాలన్నారు. బుధవారం మాధవధార లాన్సమ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని ప్రమాదాలు జరిగిన సమయంలో వెను వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇస్తే నష్టాన్ని నివారించే విధంగా తాము చర్యలు తీసుకుంటామన్నారు. నగర పరిధి కావడంతో ప్రమాద స్థలానికి 5 నిమిషాల్లోపే చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహాయపడతారని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు అందించి, మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలకృష్ణ, పరీద్ తదితరులు పాల్గొన్నారు.

## సెమీఫైనల్స్‌కు రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ నిర్వహిస్తున్న డివిజన్ అంతర్ శాఖల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ సెమీ ఫైనల్స్ దశకు చేరింది. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లకు అంతర్జాతీయ మాజీ ఫుట్‌బాలర్, భారత ఆర్మీ జట్టు మాజీ గోల్‌కీపర్ డి.వి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో డీజిల్ లోకోషెడ్ 1-0 గోల్‌తో అకౌంట్స్ విభాగంపై, మరో మ్యాచ్‌లో ఆపరేటింగ్ 1-0 గోల్ తేడాతో ఇంజనీరింగ్ శాఖపై, ఇంకో మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ (వోపీ) 5-4 స్కోరు తేడాతో డీఆర్‌డీపై గెలుపొంది సెమీస్‌కు చేరాయి. ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వైసీపీ కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తాం: అమర్‌నాథ్

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోసం ఈనెల 19న జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నేపథ్యంలో తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీచేస్తున్నామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం జరిగే ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. మద్దిపాలెంలోని పార్టీ కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీలో కూటమికి బలం లేకపోయినా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో 58 మంది వైసీపీ కార్పొరేటర్లకు విప్‌జారీ చేస్తున్నామని, ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ బీసీ జనరల్‌కు ఈ పదవి రిజర్వు చేసినా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇచ్చారన్నారు. యాదవ సామాజిక భవనం కోసం ఎండాడలో భూమి కేటాయించారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మేయర్ పీఠం నుంచి దింపేయాలని కుట్ర పన్నుతోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్ పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో దిశా సమావేశం

మహారాణిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానటరింగ్ కమిటీ(దిశా) సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటి మార్గదర్శకాలపై సమీక్షిస్తారని తెలిపారు.

# కన్న తండ్రే కాలయముడై!

... 5వ పేజీ తరువాయి

తగరపువలస పాతసినిమాహాలు జంక్షన్ వద్దకు వెళ్లిన తర్వాత ఒక దుకాణం ముందు వేసిన రేకులషెడ్‌లో పిల్లలను నిద్రపుచ్చాడు. అక్కడ బళ్లారి నుంచి పప్పులోడుతో వచ్చిన లారీ తగరపువలసలో కొంత, విజయగరంలో కొంత సరకు అన్‌లోడ్ చేయాల్సి ఉండడంతో పిల్లలను నిద్రపుచ్చిన దుకాణం ముందు ఆపారు. తగరపువలస మార్కెట్‌కు మంగళవారం సెలవు కావడంతో లారీ అక్కడే ఉండిపోయింది. కుమారుడు, కుమార్తె నిద్రపోతుండగా మద్యం మత్తులో ఉన్న తండ్రి విచక్షణ మరిచి తన నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక బిగ్గరగా ఏడుస్తుండగా, పక్కనే ఆగివున్న లారీలో వంట చేసుకుంటున్న సిబ్బంది విన్నారు. ఏం జరిగిందో చూసిరావాలని లారీ డ్రైవర్ కమ్ ఓనర్ క్లీనర్‌ను పంపించాడు. అతడు వెళ్లిచూసేసరికి బాలికపై ఆ వ్యక్తి లైంగికదాడి చేస్తుండడంతో జాతీయరహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనాలను ఆపి విషయం చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారంతా కన్నడంలో మాట్లాడుతుండడం, తెలుగు రాకపోవడంతో ద్విచక్రవాహదారులకు అర్థం కాలేదు. చివరకు ఒక వ్యక్తి సమీపంలోని బ్యాంకు సెక్యూరిటీ గార్డు వద్దకు వెళ్లి విషయం చెప్పగా, తనకు తెలిసిన హోంగార్డుకు సమాచారం ఇచ్చాడు. అతడు తగరపువలసలో ఉన్న కానిస్టేబుల్‌కు చెప్పడంతో అతడు వెళ్లి చూసేసరికి బాలిక తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతోంది. దీంతో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నిర్మలకు సమాచారం అందించాడు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని బాలికను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పక్కనే నిద్రపోతున్న ఏడేళ్ల బాలుడిని తల్లి వద్దకు, నిందితుడిని భీమిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని మహిళా పోలీసుస్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు బుధవారం ఉదయం పరిశీలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, మహిళా పోలీసుస్టేషన్‌కు అప్పగించామని సీఐ తిరుమలరావు తెలిపారు.

# పకడ్బందీగా చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

అశోక్ గజపతిరాజు దర్శనం అనంతరం మూడు గంటల నుంచి సామన్య భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అదే సమయంలో వీవీఐపీలు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉదయం 5 గంటల్లోగానే అంతరాలయాల దర్శనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రూ.1,500 టికెట్ తీసుకున్న అధికారులు, మంత్రులకు అనివార్య కారణాల వల్ల ఉదయం రాలేకపోతే సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తామన్నారు. చందనోత్సవానికి లక్షమంది పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి భక్తుడు దర్శనం చేసుకుని, బయటకు రాగానే పులిహోర, దద్దోజనం, లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించాలని, నిత్యాన్నదానం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్, వీల్‌చైర్స్ ఏర్పాటుచేయాలన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ క్యూలైన్ పరిధి పెంచడంతో పాటు సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రూ.1,500 టికెట్లను మా బంధువులకు ఇచ్చి, దర్శనానికి పంపిస్తే అవి నకిలీవిగా తేలిందని, ఈ సారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా ప్రవేశమార్గంలోనే టికెట్లు పరిశీలించేలా చూడాలన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సామన్య భక్తులకు సంతృప్తిగా దర్శనమయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా పోలీసు, దేవదాయశాఖలో దైవభక్తి ఉన్న ఉద్యోగులను మాత్రమే వీఐపీ మార్గంలో ఉంచాలన్నారు. దురుసుగా ప్రవర్తించేవారిని ఎట్టి పరిస్థితుల్లో నియమించవద్దని, అధికారులు తమ బంధువులు, సిబ్బందిని క్యూలైన్ల మధ్యలోకి పంపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రొటోకాల్ కారణంగా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పుసపాటి అశోకగజపతిరాజు మాట్లాడుతూ సామన్య భక్తులకు సత్వరం దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆగమశాస్త్ర నిపుణలను సంప్రదించి వారు ఏ సమయానికి రమ్మంటే అదే సమయానికి తాను దర్శనానికి వస్తానన్నారు. దేవదాయశాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్ మాట్లాడుతూ భక్తుల క్యూలైన్ మోనటరింగ్, ఎంత సమయానికి ఎంత మంది భక్తులు దర్శించుకున్నారనే వివరాలు, ప్రత్యేక బారికేడ్లు, తదితర చర్యలు చేపడుతున్నట్టు తెలియజేశారు. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్ మాట్లాడుతూ మల్టిపుల్ క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సింహాచలం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు మాట్లాడుతూ క్యూలైన్ పొడువు పెంచుతామని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

# జడ్పీ పనులకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

కోరారు. ఇందుకు సమావేశం ఆమోదించింది.

**కేజీహెచ్‌లో రోజూ 'సూపర్' సేవలు**

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు శివానంద్ మాట్లాడుతూ, కేజీహెచ్‌లో వారం రోజులపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మార్చురీ గది వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేశామన్నారు. వేసవిలో వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించడం కోసం ఆరు బెడ్లతో ఉన్న ఏసీ గదిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా ఓపీ కౌంటర్లు ఓపెన్ చేశామని చెప్పారు.

**జలజీవన్ మిషన్ పనులపై గోప్యత ఎందుకు?**

జిల్లాలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులపై గోప్యత ఎందుకని, సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వడంలేదని చైర్‌పర్సన్ సుభద్ర అధికారులపై మండిపడ్డారు. పద్మనాభం మండలం నేరేళ్లవలసలో సచివాలయ భవన నిర్మాణం కోర్టు వివాదాలతో నిలిచిపోయిందని జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామని విశాఖ జేసీ మయూర్ అశోక్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అరకులోయ ఎంపీ తనూజరాణి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, సామాజిక కార్పొరేషన్ల చైర్మన్లు పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర, జడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

మాత్రం కూటమి ప్రజాప్రతినిధులు, నేతల పేర్లు చెప్పి, అధికారులను ప్రసన్నం చేసుకుని మార్కెట్‌లో ఆశీలు వసూలు ప్రక్రియను తన చేతుల్లోకి తీసేసుకున్నారు. అంతేకాకుండా ఆశీలు వసూలు ప్రారంభించిన మొదటిరోజే పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, పార్కింగ్ స్థలంలోనూ దుకాణాలను ఏర్పాటుచేయిచారు. దీంతో మార్కెట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌కు సమస్య తలెత్తింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమవడంతో పోలీసులు మెయిన్‌రోడ్డుతోపాటు మార్కెట్ చుట్టూ ఉన్న రోడ్లపై ఆక్రమణలను తొలగించారు. కానీ జోన్-4 అధికారులు డిపార్టుమెంట్ కలెక్షన్ పేరుతో కాంట్రాక్టర్‌తోనే ఆశీలు వసూలు చేయిస్తున్నారు. వేలం సమయంలో జోన్-4 అధికారులు విడుదల చేసిన గెజిట్‌లో ఆశీలు వసూలుకు పూర్ణామార్కెట్ తూర్పున ప్రధాన రహదారి, దక్షిణం వైపు వస్త్ర దుకాణాలు, పడమరవైపు పండ్లరసం దుకాణం, ఉత్తరం వైపున స్నేహ ఫుట్‌వేర్ దుకాణం మధ్య ఉన్న దుకాణాలు, మార్కెట్‌లోపల దుకాణాల నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ కాంట్రాక్టర్ జగదాంబ జంక్షన్ సమీపంలోని టర్నర్‌చౌల్ట్రీ నుంచి కొత్తరోడ్డు వరకు, పూర్ణామార్కెట్ బస్టాప్ నుంచి సీహార్స్‌జంక్షన్ వరకు, రవిబుక్ షాప్ నుంచి పందుంపుళ్లసందు వరకు ఉన్న దుకాణాల నుంచి ఆశీలు వసూలుచేస్తున్నారు. పూర్ణామార్కెట్‌లోకి వచ్చిపోయే వాహనాల నుంచి ఆశీలు వసూలు చేయాల్సి ఉండగా, వన్‌టౌన్‌లోని సగం ప్రాంతాలకు వచ్చే అన్నిరకాల గూడ్స్ వాహనాల నుంచి ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జోన్-4 అధికారులు కాంట్రాక్టర్‌కు అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పైగా ఇటీవల ఒక వ్యాపారి గెజిట్‌లోని సరిహద్దులకు మించి ఆశీలు వసూలు చేస్తున్నారంటూ జోన్-4 అధికారులకు ఫిర్యాదుచేసినా కనీసం చర్యల్లేకపోవడంతో అధికారులకు భారీగా ముడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ దృష్టిసారించి కాంట్రాక్టర్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని వ్యాపారులు కోరుతున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, తదితరులు

## మెహర్ నగర్‌లో ఖాళీ స్థలం పరిశీలన

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

గాజువాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి మెహర్ నగర్‌లో భారీ భవనాల మధ్య ఖాళీ స్థలం డంపింగ్ యార్డుగా మారడంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఖాళీ స్థలమా.. డంపింగ్ యార్డా' శీర్షికతో కథనం ప్రచురితమవ్వడంపై శానిటరీ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.ఈశ్వరరావుతో పాటు సిబ్బంది ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు ఇక్కడ నెలకొన్న పరిస్థితిని వారికి వివరించారు. దీంతో సంబంధిత స్థల యజమానిని ఫోన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంప్రదించి త్వరితంగా ఖాళీ స్థలంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. వారం రోజుల్లోగా ఈ స్థలాన్ని శుభ్రపరుస్తామని యజమాని చెప్పినట్టు ఈశ్వరరావు పేర్కొన్నారు.

### సెల్ టవర్ ఏర్పాటుపై ఫిర్యాదు

అగనంపూడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి శాంతినగర్‌లో సెల్ టవర్ ఏర్పాటుపై స్థానికులు బుధవారం గాజువాక జోన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరావును కలిసి ఫిర్యాదు చేశారు. జనావాసాల మధ్య సెల్ టవర్‌ను నిర్మిస్తే తరంగాల కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల తక్షణమే అనుమతులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీని కలిసిన వారిలో స్థానికులు గల్లా రుద్రకుమార్, బి.సత్యనారాయణ, చిత్తా నాగమణి, తదితరులు ఉన్నారు.

### అదృశ్యమైన యువకుడు కుటుంబ సభ్యులకు అప్పగింత



సునీల్‌ను కుటుంబీకులకు అప్పగించిన దృశ్యం

గాజువాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల క్రితం అదృశ్యమైన యువకుడిని పట్టుకుని కుటుంబ సభ్యులకు గాజువాక సీఐ పార్థసారథి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాం ప్రాంతానికి చెందిన గోపి సునీల్‌కుమార్ (24) గత ఏడాది డిసెంబరు రెండున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదంటూ కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సునీల్ కర్నూల్‌లో ఉన్నట్టు తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసులు సునీల్‌ను ఇక్కడకు తీసుకువచ్చి బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 14, క్యారెట్ 28 దొండకాయలు 18, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, క్యాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)**

| | |
|---|---|
| విశాఖపట్నం | 425 |
| విజయనగరం | 429 |
| శ్రీకాకుళం | 429 |

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 110 |
| లైవ్ ధర | 130 |
| విత్ స్కిన్ | 230 |
| స్కిన్‌లెస్ | 240 |

# కాంట్రాక్టు కార్మికుల్లో టెన్షన్..టెన్షన్

- స్టీల్‌ప్లాంటులో వీడని తొలగింపు ప్రక్రియ
- తొలగింపులు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వని ఉక్కు యాజమాన్యం
- మే 20 తరువాత పరిస్థితి ఎలా ఉంటుందోనని కార్మికుల భయాందోళన



**ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):** స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను తొలగింపు భయం వీడడం లేదు. దీంతో వారు క్షణ క్షణం.. భయం భయంగానే విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే ప్రధాన డిమాండ్‌తో బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తామని కార్మిక సంఘాలు చెప్పిన విషయం తెలిసిందే. అయితే బుధవారం అర్ధరాత్రి వరకు ఆర్‌ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులకు మధ్య చర్చలు జరగడం.. నిరవధిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయడం విదితమే. కానీ ఈ చర్చల్లో కార్మికులను తొలగించబోమని ఉక్కు యాజమాన్యం ఎక్కడా స్పష్టమైన ఇవ్వలేదు.

ప్రభుత్వ పెద్దలను కలిసి తమ గోడు వినిపించుకుంటామని కార్మిక సంఘాల నాయకులు చెబితే మే 20వ తేదీ వరకు తొలగింపు ప్రక్రియను నిలిపివేస్తామని మాత్రమే యాజమాన్యం పేర్కొంది. అంతేకాక ఇప్పటివరకు తొలగించిన 1,503 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని కూడా యాజమాన్యం హామీ ఇవ్వలేదు. ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న వారిలో ఎవరైతే సరిగ్గా పనిచేయరో వారిని తొలగించి.. వారి స్థానంలో గతంలో తొలగించిన 1,503 మందిలో బాగా పనిచేసే వారిని తీసుకుంటామని మాత్రం యాజమాన్యం కార్మిక నాయకులకు స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఎవరిని, ఏ ప్రాతిపదికన తొలగిస్తారోనన్న భయం ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో నెలకొంది. కాగా నెల రోజుల్లోగా ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యను విన్నవించి కార్మికుల తొలగింపు జరగకుండా చూస్తామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అయితే కార్మికులను తొలగించకుండా చూస్తామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఒకవేళ మే 20వ తేదీలోగా ప్రభుత్వం నుంచి హామీ రాకపోతే తమ పరిస్థితి ఏమిటని బిక్కుబిక్కుమంటూ పనులు సాగిస్తున్నారు. ఎప్పుడు ఎవరు పనులు కోల్పోయి రోడ్డున పడతామోనన్న భయంతో గడుపుతున్నామని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కుటుంబ సాధికార సభ్యులను నియమించాలి | టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు ఎంఎస్ చౌదరి

గాజువాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ బూత్‌ల పరిధిలో కుటుంబ సాధికర సభ్యులను తక్షణమే నియమించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకుడు ఎంఎస్ చౌదరి అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోగా ఈ నియామకాలను పూర్తి చేయాలన్నారు. అతి త్వరలోనే పార్టీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్యేయమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ చౌదరి

ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పుచ్చా విజయ్‌కుమార్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, రాజన్‌రాజు, కనకరాజు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో రాజ్యమేలుతున్న చీకటి

- రాత్రిపూట రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చీకటిమయమైన వడ్లపూడి రోడ్డు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 16: జీవీఎంసీ 86వ వార్డు పరిధి దువ్వాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి, వుడానగర్, సాయిరామ్ నగర్, పకీరుతఖ్యా, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారి, 88వ వార్డు కాపు,యాదవ జగ్గరాజు పేట కాలనీ పరిసరాల్లో గాఢాంధకారం రాజ్యమేలుతోంది. ఇక్కడి విద్యుత్ దీపాల పనితీరు సక్రమంగా లేదని, సుమారు రెండున్నరేళ్లుగా ఇదే దుస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలగడం, ఆరిపోవడం తప్పా పూర్తి స్థాయిలో వీధి దీపాలు వెలగడం లేదని వాపోతున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా యాదవ జగ్గరాజుపేట, మాతృశ్రీ నగర్, పకీరుతఖ్యా, వుడా నగర్ సమీపాల్లో ఉన్న మలుపుల వద్ద రాత్రిపూట రాకపోకలు సాగించడం కష్టతరంగా ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

### 23న ఎస్.జానకి సంగీత విభావరి

విశాఖపట్నం,ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న ఆమె పాటలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు 'యాక్మి' అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జయంతి చౌదరి క్రియేషన్స్, ఎంవీఆర్ ఈవెంట్స్ 'యాక్మి' సంయుక్త ఆధ్వర్యంలో 23న మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఎస్.జానకి పాడిన సినీ తాలతో సినీసంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా సంగీత సహకారంతో జరగనున్న సంగీత విభావరిలో సింగర్స్ మాళవిక, హితేష్ సాయిలతో పాటు పలువురు జానకి ఆలపించిన గీతాలను ఆలపిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఫ్లూట్ మాస్ట్రో తాళూరి నాగరాజు, మణి నాగరాజు దంపతులను ఘనంగా సత్కరిస్తామని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : గండి బాబ్జీ

పెందుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని... పరిష్కరించడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. పెందుర్తిలోని టీడీపీకార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 48 వినతులు స్వీకరించారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ సమస్యలపై అర్జీలు ఎక్కువగా అందాయి. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ వినతులు ఇచ్చినవారు తమ ఆధార్, మొబైల్ నెంబర్లను దరఖాస్తులో పేర్కొనాలన్నారు. అర్జీలను కంప్యూటరీకరించి సీఎం డాష్ బోర్డుకు పంపుతామన్నారు. అర్జీదారులకు సీఎం కార్యాలయం నుంచే ఫోన్ చేసి సమస్య పరిష్కార విషయం చెబుతారన్నారు. స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి భరిణికాని సాయినాథ్, టీడీపీ నాయకులు రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ గంద్రెడ్డి మాలతి, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, గండి వంశీకుమార్, అవగడ్డ అప్పలనాయుడు,సుఖవాసీ అజయ్, కునుగంటి కనకరాజు, గనిశెట్టి కనకరాజు, గొరపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.



అర్జీ పరిష్కారంపై అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ. చిత్రంలో దరఖాస్తుదారులు



మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న కేఎస్ఎన్ మూర్తి, కొరటాల ప్రభాకరరావు, వల్రే నాంచారయ్య ( కుడి నుంచి ఎడమకు)

## కందుకూరి విశిష్ట పురస్కారాలు

కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా స్టేట్ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కందుకూరి విశిష్ట పురస్కారాలను అందించింది. విజయవాడ తుమ్మలాపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగిన సభలో జిల్లాలోని కేఎస్ఎన్ మూర్తి, కొరటాల ప్రభాకరరావు, వల్రే నాంచారయ్యలకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

## సీఎం జన్మదినోత్సవానికి 'తెలుగుశక్తి' ఏర్పాట్లు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గంటా, తదితరులు

వేపగుంట, సింహాచలం ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినోత్సవాలు ఈ నెల 19న ఘనంగా నిర్వహించేందుకు తెలుగుశక్తి సంఘం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం గోశాల సమీపంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నగరంలోని దసపల్లాలో ఈ నెల 19న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదినోత్సవాలకు రావాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ ఆహ్వానించారు. వైసీపీ నేతల కబ్జాలో ఉన్న దేవస్థాన భూములను సంరక్షించాలని, ఎన్.టి.ఆర్. జయంతిని రాష్ట్రం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీతల అప్పారావు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని విద్యార్థి ఆత్మహత్య

కొమ్మాది, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో ఉండేందుకు ఇష్టం లేక విద్యార్థి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా గరివిడి మండల కేంద్రంలోని బద్రిప్రసాద్ కాలనీకి చెందిన తీడ అచ్యుతరావు కుమారుడు కార్తికేయ (15) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. జేఈఈ పరీక్షల నిమిత్తం తల్లిదండ్రులు అతన్ని ఈనెల 13న మారికవలసలోని ఒక కార్పొరేట్ కళాశాలలో చేర్చారు. అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. జాయిన్ చేసినప్పుడే తనకు వసతి గృహంలో ఉండడం ఇష్టం లేదని, డే స్కాలర్‌గా జాయిన్ అవుతానని తల్లిదండ్రులకు చెప్పాడు. కానీ వారు అందుకు అంగీకరించలేదు. మొదటి ఏడాది వసతి గృహంలో ఉండి చదువుకుంటే, ద్వితీయ సంవత్సరం నుంచి డే స్కాలర్‌గా చేరుస్తామని చెప్పి, కుమారుడ్ని ఒప్పించాడు. మంగళవారం ఉదయం కూడా కార్తికేయ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను వసతి గృహంలో ఉండలేనని ఇంటికి వచ్చేస్తానని తెలి పాడు. అదే రోజు సాయంత్రం అతని తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి నచ్చచెప్పి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం కార్తికేయ తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్‌ఫొటో)

మల్కాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వెనుక బుధవారం సాయంత్రం సంతోష్ (39) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్ అద్దెకు ఉంటున్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరేసుకొని మృతిచెందాడు. భార్య, పిల్లలు ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్ల ఆమె దూరంగా ఉంటోంది. సంతోష్ తండ్రి కొడుకును చూసేందుకు ఇంటికొచ్చాడు. అప్పుడు ఇంటి తలుపులు వేసి ఉండడంతో సంతోష్‌ను పలుమార్లు పిలిచినప్పటికీ తలుపులు తెరవకపోవడంతో బలవంతంగా లోపలకు ప్రవేశించాడు. లోన పరిశీలించగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో కిందకు దించారు. అప్పటికే ప్రాణం పోవడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను ఎలా అదుపు చేయాలో ప్రజలకు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

**అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి ఎన్.గోపీకృష్ణ**

పెదగంట్యాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగిన తరువాత చర్యలు చేపట్టే కన్నా అసలు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మంచిదని అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి ఎన్.గోపీకృష్ణ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది బుధవారం మత్స్యకార గ్రామం పల్లిపాలెంలో, పాత గాజువాక సెలెస్ట్ అపార్టమెంటులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలను ప్రాథమిక స్థాయిలో నివారించాల్సిన అవసరం ఉందన్నారు. వుడ్ ఫైర్, గ్యాస్ ఫైర్, ఎలక్ట్రికల్ ఫైర్ నియంత్రణపై స్థానికులకు అవగాహన కల్పించారు.

## జీవీఎంసీ ఆధ్వర్యంలో 30 చలివేంద్రాలు




గాజువాకలోని చలివేంద్రం

గాజువాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో 30 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జడ్సీ శేషాద్రి తెలిపారు. అదేవిధంగా 16 వరకు గ్రీన్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. రోజు రోజుకు ఎండలు పెరుగుతుండడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా చలివేంద్రాలలో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొన్ని కీలక జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారుల సౌకర్యార్థం గ్రీన్ షెల్టర్లను ఏర్పాటు చేసినట్టు జడ్సీ పేర్కొన్నారు.

## నేడు దుర్గమాంబ జాతర



అగనంపూడి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం నుంచి ప్రధాన రహదారుల వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

**ఘనంగా జోడి ఘటాల ఉత్సవం**

డొంకాడ దుర్గమాంబ ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోడి ఘటాల జాతర, కోటి దీపాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాసరి త్రినాథ్, సన్యాసిరావు, అట్టా అప్పారావు, విశ్వనాథ్, బి.అప్పారావు, కరణం శ్రీను, పెంటారావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్ బాగు



విద్యార్థినికి సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేసి అభినందిస్తున్న దృశ్యం

మల్కాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల 2024-2025 ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడంతో బుధవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో సెయింట్ ఆన్స్ కళాశాల సాధారణ కోర్సుల్లో 73శాతం, వృత్తివిద్యలలో 93శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు రాబట్టిందన్నారు. కళాశాలకు చెందిన ప్రియాంక పాండే, ప్రజ్ఞా ప్రీతి మహంతి 1000 మార్కులకు 976 సాధించి కళాశాల ప్రతిభావంతులుగా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో నాగజ్యోతి 470 మార్కులకు 450, శ్రేయ 440 మార్కులకు 432 సాధించారు. చంద్రకళ 500 మార్కులకు 493 మార్కులు, కె.నవ్య 500 మార్కులకు 492 సాధించి ప్రథమ సంవత్సర ఫలితాల్లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. 38 మంది 90 శాతంపైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు సిస్టర్ గెసిల్ల, సిస్టర్ కాన్లిన్ పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సులలో చేరితే భవిష్యత్ బాగుంటుందో వాటి వివరాలను సీనియర్ అధ్యాపకులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ఎ.ఆదిలక్ష్మి, వై.ప్రేమలత వివరించారు. కార్యక్రమాన్ని అధ్యాపకురాలు సుధ సమన్వయం చేశారు.